క్లుప్తంగా

గంగాభవాని నెల పొంగళ్లు రేపు

ఉదయగిరి రూరల్: మండలంలోని గంగిరెడ్డిపల్లిలో అనంతపురి గంగాభవాని అమ్మవారి నెల పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. బ్రహ్మోత్సవాలను నిర్వహించి నెల రోజులు పూర్తయిన సందర్భంగా అమ్మవారికి విశేషాభిషేకాలు, పూజలు, ప్రత్యేక అలంకరణ, సామూహిక పొంగళ్లు, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లుగా వివరించారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

డిప్యూటీ ఎంపీడీఓగా మునిరత్నం



అనుమసముద్రంపేట: మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓగా మునిరత్నం శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన గూడూరులోని డీఎల్‌పీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ డిప్యూటీ ఎంపీడీఓగా పదోన్నతి పొంది ఏఎస్‌పేటకు వచ్చారు. తొలుత ఆయన ఎంపీడీఓ ప్రసన్నకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు.

అంగన్‌వాడీలు సమయాన్ని పాటించాలి



సీతారామపురం : అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో అంగన్‌వాడీలు సమయాన్ని పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని పోకలింగాయపల్లి-2 అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి అంగన్‌వాడీలకు సూచనలు చేశారు. లబ్ధిదారుల ఫేస్‌క్యాప్చర్, ఈకేవైసీ, ఆధార్ ఫేస్ మ్యాచింగ్ నూరు శాతం పూర్తి చేయాలన్నారు. పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ప్రీస్కూల్ చిన్నారుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని ఆదర్శ పాఠశాలలో నెల్లూరు యువజన అధికారి మహేంద్రారెడ్డి సహకారంతో హెడ్స్ సంస్థ డైరెక్టర్ వెలగపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ జనాభా దినోత్సవం ప్రాముఖ్యతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. టీ మహిత ప్రథమ, ఎన్ సంధ్య, శ్రీలక్ష్మి తృతీయ, టీ త్రివేణి, ఎస్ యామిని కన్సోలేషన్ బహుమతులను అందుకున్నారు.

కనులపండువగా గ్రామోత్సవం



కలిగిరి: స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో జరుగుతున్న గురుపూర్ణిమ వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయిబాబా గ్రామోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. బాబాను పూలతో విశేషంగా అలంకరించి ట్రాక్టర్‌పై గ్రామంలో ఊరేగించారు. గ్రామోత్సవంలో కోలాట ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కిలో పొగాకు సగటు ధర రూ.212



కలిగిరి: స్థానిక పొగాకు వేలంలో కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకుకు సగటు ధర రూ. 212.03 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు వేలానికి 450 బేళ్లను తీసుకురాగా, 376 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ. 160, సగటున రూ.212.03 ధర పలికిందని వివరించారు.

మామిడి రైతు కుదేలు





మామిడి పండ్లను చూపుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు



పండిపోయి నేల రాలిన మామిడి కాయలు

- ఆత్మకూరు డివిజన్‌లో 370 హెక్టార్లలో సాగు
- పూర్తిగా పతనమైన తోతాపురి(అంటు) కాయల ధరలు
- కోత కూలిలు రాక తోటల్లోనే వదిలేసిన వైనం
- పండి చెట్ల కిందే రాలిపోతున్న కాయలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

ఆత్మకూరు: ఈ ఏడాది మామిడి కాయలకు ధరలు లేక రైతులు విలవిల్లాడుతున్నారు. బంగినపల్లి రకం ఓ మోస్తరు ధరలు పలికిన, తోతాపురి రకం ధరలు పూర్తిగా పతనమయ్యాయి. కనీసం కోత కూలి ఖర్చులు కూడా రాకపోవడంతో తోటల్లోనే కాయలను వదిలేస్తున్నారు. దీంతో కాయలు పండి చెట్ల కింద రాలిపోతుండడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా మార్కెట్‌లో మామిడి పండ్లు రకాలను బట్టి కేజీ రూ.50 నుంచి రూ. రూ.100 వరకు విక్రయిస్తుంటారు. అయితే ఈ ఏడాది మార్కెట్లో ధరలు లేకపోవడంతో అడిగిన కాడికి ఇవ్వకతప్పని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది తొలి రోజుల్లో కాపు తక్కువగా ఉండడంతో ధరలు బాగా ఉంటాయని రైతులు తెగ ఆనందపడ్డారు. అయితే ఆ ఊహలు తలకిందులయ్యాయి. మామిడిలో పేరొందిన బంగినపల్లి కాయలు తొలి రోజుల్లో ఓ మోస్తరుగా మంచి ధరకే విక్రయించినా కొద్ది రోజులకే ధరపడింది. దీంతో తక్కువ ధరకే ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు తెలిపారు. కాగా జ్యూస్ ఫ్యాక్టరీల వారు ఎక్కువగా తోతాపురి(అంటు) మామిడి కాయలను వినియోగిస్తారు. ఈ కాయలను అడిగే వారు లేకపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

కూలీల ఖర్చులు గిట్టుబాటు కాక..

ఆత్మకూరు డివిజన్ పరిధిలో 370 హెక్టార్లకు పైగా మామిడి సాగులో ఉంది. అధిక శాతం బంగినపల్లి, తోతాపురి రకాలను సాగుచేస్తున్నారు. ఏటా జ్యూస్ ఫ్యాక్టరీల ఏజెంట్లు తోటల వద్దకు చేరుకుని తోతాపురి కాయలను కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. రైతులు సొంతంగా లారీలను ఏర్పాటు చేసుకుని ఫ్యాక్టరీలకు తరలించినా తీసుకుంటుంటారు. అయితే ఈ ఏడాది ఫ్యాక్టరీల యజమానులు కాయలను కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది క్వింటా రూ.400కే అడుగుతుండడంతో కనీసం కూలి ఖర్చులు కూడా గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు. మరోవైపు ఫ్యాక్టరీ వద్ద రోజుల తరబడి దించుకోకపోతుండడంతో లారీ కిరాయికి అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఈ కారణంగా స్థానిక రైతులు సొంతంగా కాయలను ఫ్యాక్టరీకి తరలించే ఆలోచన విరమించుకుని చెట్ల మీదనే కాయలను వదిలేస్తున్నారు. దీంతో కాయలు పండి చెట్ల కింద రాలిపోతున్నాయి. దీంతో తోటల్లోకి వెళ్లాలంటే బాధగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో టన్ను రూ.8వేలకుపైగా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తోతాపురి రకం మామిడి కాయలు రూ.8వేలకు పైగా పలికాయి. చిత్తూరు జిల్లాలోని మామిడి జ్యూస్ ఫ్యాక్టరీలకు కాయలను తీసుకెళితే ధరలు గిట్టుబాటు అయ్యేవని రైతులు చెబుతున్నారు. అప్పట్లో ప్రభుత్వం సైతం మామిడి రైతులకు అండగా నిలిచిందని, ప్రస్తుత ప్రభుత్వం రైతులను గాలికి వదిలేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లు

కలిగిరి: మండలంలోని వెలగపాడు సమీపంలో రోడ్డుపై నడిచివెళ్తున్న వృద్ధుడ్ని మోటార్‌సైకిల్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు..వెలగపాడు సమీపంలో నూతన ఏర్పాటు చేస్తున్న లేఅవుట్‌లో ప్రకాశం జిల్లా దర్శి ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు బేల్దారిమేస్త్రిగా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి వెలగపాడులో పనిచూసుకుని లేఅవుట్ వద్దకు నడిచి వస్తున్నాడు. ఈ క్రమంలో కలిగిరికి మోటార్‌సైకిల్‌పై వస్తున్న పాతానాపురం గ్రామానికి చెందిన దంపతులు ప్రమాదవశాత్తు వృద్ధుడ్ని ఢీకొన్నారు. ఈ ఘటనలో వృద్ధుడు తీవ్రంగా గాయపడగా, దంపతులు స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లును 108 వాహనంలో కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కలిగిరి ఎస్సై ఉమాశంకర్ వివరాలు సేకరిస్తున్నారు.

రెండు అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు



పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు గదులను పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి

సీతారామపురం : మండలంలోని నారాయణప్పపేట, సీతారామపురం గ్రామాల్లో ఓటర్లు పెరిగినందున అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు పాఠశాలలను పరిశీలించారు. అలాగే గుండుపల్లిలో 3,4 పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాల భవనాన్ని జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తొలగించడంతో ప్రత్యామ్నాయంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఓగూరువాండ్లపల్లి జెడ్పీ హైస్కూల్లోని గదులను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ సంధాని, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

యూరియా కొరతను తీర్చండి

సోమశిల: అనంతసాగరం మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరత సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనంతసాగరం మండలంలోని రైతులు వేలాది ఎకరాల్లో రెండో పంటను సాగుచేస్తున్నారని తెలిపారు. రైతులకు అవసరాలకు సరిపడా యూరియాను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. రాత్రులు వస్తున్న లారీల ఎరువులు ఉదయానికి ఎలా పోతున్నాయని ప్రశ్నించారు. రోజుకు ఎన్ని లారీల ఎరువులు వస్తున్నాయి..ఎంత మంది రైతులకు ఇస్తున్నారు..రోజువారీ ఎరువుల రికార్డులను బయటపెట్టాలని వ్యవసాయాధికారులను డిమాండ్ చేశారు. ప్రైవేట్ దుకాణాల్లో కూడా యూరియా దొరకక రైతులు అల్లాడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని, లేకుంటే రైతులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

గురుకులాన్ని పరిశుభ్రంగా ఉంచండి



విద్యార్థినులతో మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

ఆత్మకూరు: గురుకులాన్ని పరిశుభ్రంగా ఉంచాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆదేశించారు. ఆత్మకూరులోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం సాయంత్రం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత గురుకులం పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులు, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా..లేదని ఆరాతీశారు. పాఠశాల గదులు, ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేరని తెలుసుకుని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రూత్‌ను ఆదేశించారు ప్రహరీ క్లబ్ ప్రొటెక్షన్ కమిటీ లేదని తెలుసుకుని వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని తరగతి గదుల్లో బాలల హెల్ప్‌లైన్ నంబర్ 1098ను ప్రదర్శించాలని ఆదేశించారు. పాఠశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరలో ఆయిల్‌పామ్ సబ్సిడీ బకాయిల విడుదల



ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న అధికారులు

దుత్తలూరు: 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి రావాల్సిన ఆయిల్‌పామ్ సబ్సిడీ బకాయిలు రూ.100 కోట్లను త్వరలో రైతులకు విడుదల చేయనున్నట్లు ఉద్యాన శాఖ సంచాలకుడు డాక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని వెంకటంపేటలో ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతులతో శుక్రవారం ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ మొక్కలను ట్రయాంగిల్ పద్ధతిలో ఎకరానికి 57 చొప్పున నాటవచ్చని తెలిపారు. మూడేళ్ల వరకు పత్తి, వేరుశనగ, కూరగాయలు, పూలమొక్కలు, అపరాలు వంటి వాటిని అంతర పంటలుగా వేసుకుని రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇండిజినస్ ఆయిల్‌పామ్ సాగుకు నాలుగేళ్లపాటు రూ.62 వేలు, ఇంపోర్టెడ్ ఆయిల్‌పామ్ సాగుకు రూ.71 వేలు చొప్పున అందజేస్తుందని వివరించారు. యాంత్రీకరణ, నీటివసతి పరికరాలకు రూ.20 వేలు నుంచి రూ.1.50 లక్షల వరకు రాయితీ అందజేస్తుందని తెలిపారు. జిల్లా ఉద్యాన అధికారి ఎంవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో 1400 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగుచేపట్టాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు వంద హెక్టార్లలో సాగుచేపట్టినట్లు తెలిపారు. మరో 200 హెక్టార్లలో సాగుకు 85 మంది రైతులు దరఖాస్తు చేసుకుని ఉన్నారని వివరించారు. ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ బీ శ్రీనివాసులు, ఏడీహెచ్ అనూరాధ, ఉదయగిరి, వింజమూరు ఉద్యాన అధికారులు జయశ్రీ, షహీల్, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని పాతూరు మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు కే వెంకటసుబ్బయ్యను ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. నూతన హెచ్‌ఎం టీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కొండారెడ్డి, జే వెంకటేశ్వర్లు, ఏ చంద్రన్, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ ఏఈ ఖుద్దూస్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ విద్యుత్‌లైన్‌కు మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

- సోమశిల: అనంతసాగరం, సోమశిల, చిలకలమర్రి,, రేవూరు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్‌ను ఉదయం 5 నుంచి 9 గంటల వరకు అందజేస్తున్నట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఆత్మకూరు: మండలంలోని దేపూరు శివారులోని వ్యవసాయ పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆత్మకూరు ఎస్సై ఎస్‌కే జిలానీ తన సిబ్బందితో కలిసి శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.10,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి జూదరులను కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్టుషాపులపై దాడులు

వరికుంటపాడు: మండల కేంద్రమైన వరికుంటపాడులో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 43 బాటిళ్ల మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మహమ్మద్ అబ్దుల్‌జలీల్ తెలిపారు. బెల్టుషాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఆత్మకూరు: మండలంలోని వాశిలి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు..సందీప్ అనే యువకుడు తన మిత్రుడితో కలిసి బుచ్చిరెడ్డిపాళెం నుంచి ఆత్మకూరుకు మోటార్‌సైకిల్‌పై వస్తున్నాడు. వాసిలి సమీపంలో మోటార్‌సైకిల్ అదుపుతప్పడంతో సందీప్ తీవ్రంగా గాయపడగా, వెనుకగా ఉన్న మిత్రుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. సందీప్‌ను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్సై జిలాని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



సంగం: స్థానిక సాయిబాబా మందిరంలో గురుపూర్ణిమ వేడుకల్లో భాగంగా అశ్వత్థనారాయణస్వామి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మందిరం ప్రాంగణంలోని రాగి, వేప చెట్లను విశేషంగా అలంకరించి కల్యాణోత్సవాన్ని జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించి తరించారు. కామేపల్లి శ్రీహరి, స్వాతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

అనధికారికంగా పొలాల మధ్య చేపల సాగు

- చికెన్ వ్యర్థాలతో నీరు కలుషితం
- త్రీమెన్ కమిటీ విచారణ



చేపల చెరువులో తేలుతున్న చికెన్ వ్యర్థాలు

చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలం కోటితీర్థంలో పొలాల మధ్యన అనధికారికంగా చేపలను సాగుచేస్తుండడంతో పాటు చేపలకు మేతగా చికెన్ వ్యర్థాలను వేస్తున్నారు. దీంతో సమీప పొలాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై స్థానిక రైతు విజయమ్మ తొమ్మిది సార్లు జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ఎట్టకేలకు కలెక్టర్ ఆదేశాలతో ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని ఆధ్వర్యంలో జలవనరుల, మత్స్యశాఖలకు చెందిన అధికారులతో కూడిన త్రీమెన్ కమిటీ చేపల చెరువును శుక్రవారం పరిశీలించింది. చేపల చెరువులో చికెన్ వ్యర్థాలు వేస్తూ కలుషితం చేయడంతో పాటు చెరువు నీటిని చేపల చెరువుకు వినియోగించడం, నీటిని మళ్లించేందుకు కొన్ని కాలువల తూములు మూసివేయడాన్ని అధికారులు గుర్తించారు. నివేదికలను ఆర్డీఓ ద్వారా కలెక్టర్‌కు త్వరలో అందజేయనున్నట్లు ఆర్డీఓ తెలిపారు.

వ్యవసాయ పాలిటెక్నిక్‌కు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారులు శుక్రవారం తెలిపారు. జిల్లాలో పొదలకూరులో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఉందన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికిగానూ వ్యవసాయ సంబంధిత కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి కలిగిన వారు శనివారంలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుడికి డీఈఓ ప్రశంసలు



సోమశిల: ఐగాట్ కర్మయోగి కోర్సుల్లో ప్రతిభ చూపిన అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డిని డీఈఓ ఆర్ బాలాజీరావు అభినందించారు. జిల్లా కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఎంఈఓలతో డీఈఓ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి సెలవుల్లో 413 ఐ గాట్ కర్మయోగి కోర్సులు పూర్తి చేసి జాతీయస్థాయిలో లీడర్ బోర్డుపై పదో ర్యాంకు సాధించిన చంద్రశేఖరరెడ్డిని డీఈఓ అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు.

పశుపోషణలో మెళకువలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ

సీతారామపురం : పాడి రైతులు పశుపోషణలో మెళకువలను పాటించాలని పశు వైద్యాధికారి రాఘవేంద్రశర్మ సూచించారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా సంజీవరెడ్డినగర్, సీతారామపురం బిట్-1 రైతుసేవా కేంద్రాల్లో పాడిరైతులకు పశుగ్రాసాల ప్రాముఖ్యతపై శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాడిరైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాస క్షేత్రాల సాగు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్‌ఎలు, పాడి రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.